నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 25 మార్చి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలలో పీఎస్సార్ టాక్స్

అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడుతున్న ఎమ్మెల్యే

- మితిమీరిపోతున్న గంజాయి బ్యాచ్ ఆగడాలు
- ప్రజలపై దాడులు చేస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు
- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, మార్చి 24 : దేశంలో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ వసూలు చేస్తుండగా, అదే మంచిర్యాలలో మాత్రం ప్రజలను బెదిరించి ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు (పీఎస్‌టీ) ట్యాక్స్ వసూలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆరోపించారు. సోమవారం మంచిర్యాలలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. ప్రేమ్ సాగర్‌రావు ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచే వసూళ్ల పర్వానికి తెరతీశారని, గంజాయి బ్యాచ్‌ను అడ్డంపెట్టుకుని, ఇష్టారాజ్యంగా దాడులు చేయిస్తూ, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, మంచి మంచిర్యాలగా ఉన్న జిల్లా కేంద్రాన్ని అల్లకల్లోలంగా మారుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మంచిర్యాలలోని ఉమర్ మియా హౌసింగ్ సొసైటీలో ప్లాట్లు కొనుగోలు చేసి, ఇండ్లు నిర్మించుకునే వారి నుంచి రూ. ఆరు లక్షల చొప్పున వసూలు చేశారన్నారు. నస్పూరు కలెక్టర్ ఆఫీస్ వద్ద 2023 డిసెంబర్ 10న కూల్చిన ఇండ్ల స్థానంలో ప్రస్తుతం మళ్లీ నిర్మాణాలు జరుగుతున్నాయని, ఈ విషయంలో కోట్లాది రూపాయలు చేతులు మారాయని తెలిపారు. మంచిర్యాల వ్యాపారస్తుల దగ్గర దాదాపు రూ. 40 లక్షలు, ఒక వ్యాపారి బిల్డింగ్ కూలగొట్టకుండా ఉండడానికి రూ.10 లక్షలు, మరొక బిల్డింగ్ కూలగొట్టకుండా ఉండడానికి రూ. 50 లక్షలు చేతులు మారాయని చెప్పుకొచ్చారు. లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన వెంచర్ల నుంచి కోట్లాది రూపాయలు తీసుకున్నారని, ఇటిక్యాల చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి అనే నెపంతో రూ. రెండు కోట్లకు డీల్ కుదుర్చుకున్నారని అన్నారు. తప్పు చేసే అధికారులపై ఏనాటికైనా చర్యలు తప్పవని, ఆ విషయాన్ని అధికారులు గుర్తెరుగాలని సూచించారు. బైపాస్ రోడ్డులో ప్రభుత్వ, ప్రైవేటు భూములు, బెల్లంపల్లి చౌరస్తా దగ్గర ప్రైవేటు భూమి, ఉమర్ మియా సొసైటీ లే అవుట్ పార్క్ స్థలంలో, తిలక్ నగర్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో, నస్పూర్ మున్సిపాలిటీలో ప్రేంసాగర్ రావు అనుచరులు అమ్మే భూములను ఎవరూ కొనవద్దని, ఎవరైనా అనుమతులు లేకుండా కొనుగోలు చేసినా, కట్టడాలు కట్టినా 2028లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కచ్చితంగా వాటిని కూలగొట్టే కార్యక్రమం ఉంటుందని, అందుకే ఈ విషయంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మంచిర్యాలలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ బిల్డింగును కూలగొట్టారని, అందులో బయటపడిన ఇనుపచువ్వలు, కాంక్రీటును అమ్ముకున్నారని ఆరోపించారు. చివరికి శ్మశాన వాటిక మెయింటెనెన్స్ కోసం మార్వాడి, వైశ్య వ్యాపారుల నుంచి, బంగారు దుకాణదారుల నుంచి నెలకు రూ. లక్ష చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారని, భయభ్రాంతులకు గురై వారు ఒప్పుకున్నారని తెలిపారు. శ్మశాన వాటికను మెయింటెనెన్స్ చేయాలని మున్సిపల్ అధికారులకు చెప్పి, వ్యాపారులనుంచి డబ్బులు వసూలు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందితో శ్మశాన వాటిక మెయింటెనెన్స్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మితిమీరిపోతున్న గంజాయి బ్యాచ్ ఆగడాలు

గంజాయి బ్యాచ్ ఆగడాలు మితిమీరి పోతున్నాయని, ప్రజలపై ఇష్టారాజ్యంగా దాడులు చేస్తున్నా చర్యలు తీసుకోవాల్సిన పోలీసు వ్యవస్థ ప్రేక్షక పాత్ర వహిస్తున్నదని దివాకర్ రావు అన్నారు. ఈ విషయంలో కొత్తగా వచ్చిన పోలీస్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించాలని, ఆయనపై తమకు పూర్తి నమ్మకం ఉందన్నారు. గంజాయి మత్తులో దాడులకు పాల్పడుతున్న వారిని అరెస్టు చేసి వారిపై పీడీ యాక్టు ప్రయోగించి జైలుకు పంపించాలని డిమాండ్ చేశారు. విచిత్రంగా దాడికి గురై, తీవ్ర గాయాలపాలైన వారిపైననే కేసులు పెట్టడం, హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వారిని నేరుగా జైల్లో పెట్టడం ఇక్కడి పోలీసులకే చెల్లిందన్నారు. ప్రేమ్‌సాగర్ రావు ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఒక గ్యాంగ్ ఏర్పాటు చేసుకొని వారికి గంజాయి అలవాటు చేసి వారితో దాడులు, బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గోగుల రవీందర్‌రెడ్డి, అంకం నరేశ్, బేర సత్యనారాయణ, మొగిలి శ్రీనివాస్, అక్కూరి సుబ్బయ్య, కాటం రాజు, ఎర్రం తిరుపతి, తోట తిరుపతి, శ్రీరాముల మల్లేశ్, శ్రీపతి వాసు పాల్గొన్నారు.

అకాల వర్షం అపార నష్టం

ఆసిఫాబాద్ జిల్లాలో 600 ఎకరాల్లో దెబ్బ తిన్న పంటలు

- అంచనా వేసిన అధికారులు
- సర్కారుకు నివేదికలిస్తామని స్పష్టం

బట్వల్లిలో నేలకొరిగిన మక్కను చూపిస్తున్న రైతు అంజయ్య

కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో రెండు రోజుల పాటు కురిసిన అకాల వర్షాలు రైతన్నలకు అపార నష్టాన్ని మిగిల్చాయి. సుమారు 61 గ్రామాల్లో 271 మంది రైతులకు చెందిన దాదాపు 600 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.

మామిడి, వరి, మక్క రైతులకు..

జిల్లాలో కురిసిన వడగండ్ల వర్షాలు మామిడి, వరి, మక్క పంటలకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. ముఖ్యంగా కాగజ్‌నగర్ డివిజన్‌లోని కాగజ్‌నగర్, చింతలమానేపల్లి, ఆసిఫాబాద్ డివిజన్‌లోని రెబ్బెన మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మామిడి కాయలు రాలిపోగా, మక్క, వరి పంటలు నేలకొరిగాయి. కాగజ్‌నగర్ మండలంలో 206 మంది రైతులకు చెందిన 350 ఎకరాల మక్క, 22 మంది రైతులకు చెందిన 57 ఎకరాల మామిడి, చింతలమానేపల్లి మండలంలో 10 మంది రైతులకు చెందిన 25 ఎకరాల వరి, 10 ఎకరాల పుచ్చ, 20 ఎకరాల మక్క, రెబ్బెన మండలంలోని 33 మంది రైతులకు చెందిన 136 ఎకరాల మామిడి పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. వడగండ్ల వానలతో పంటలకు జరిగిన నష్టంపై ప్రభుత్వానికి నివేదికలు అందజేస్తామని వారు తెలిపారు.

బట్వల్లిలోనేలకొరిగిన మక్కను చూపిస్తున్న రైతు

అకాల వర్షానికి పడిపోయిన మక్క చేనులో రైతు వడ్డె మల్లేశ్

ఎకరానికి రూ. 50 వేల పరిహారమివ్వాలి

రైతులు కన్నీరు పెడుతున్నా సర్కారు స్పందించకపోవడం శోచనీయం

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- అకాల వర్షానికి నష్టపోయిన పంటల పరిశీలన

మక్క పంటను పరిశీలించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, మార్చి 24 : అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ. 50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కాగజ్‌నగర్ మండలం ఈస్‌గాం గ్రామ పంచాయతీ పరిధిలో నష్టపోయిన పంటలను పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంటలు నష్టపోయి రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారని, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంట నష్టంపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం శోచనీయమన్నారు. స్థానిక బీజేపీ ఎమ్మెల్యే ఫొటోలు దిగి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. స్థానిక ఎమ్మెల్యేకు రైతుల పట్ల ప్రేమ ఉంటే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో రిజిస్ట్రేషన్ చేయించి సాయమందించేలా కృషి చేయాలన్నారు. సొంత ప్రధానమంత్రితో మాట్లాడి రైతులను ఆదుకోవాలన్నారు. నాలుగు రోజులుగా రైతులు బాధపడుతుంటే అసెంబ్లీ సమావేశాల్లో ఎందుకు లేవనెత్తడం లేదన్నారు. బెంగాళీల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే ఇప్పుడు వారిని పట్టించుకోవడం లేదన్నారు. నాలుగు రోజులుగా అనేక గ్రామాలకు విద్యుత్ సరఫరా కావడం లేదని, సరిపడా సిబ్బంది లేకపోవడం వల్ల పనులు ఆలస్యమవుతున్నాయని స్పష్టం చేశారు. అనంతరం ధ్వంసమైన ఇళ్లను పరిశీలించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడారు. అధికారులు వెంటనే సర్వే నిర్వహించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్లు కోల్పోయిన వారికి ఇండ్లు నిర్మించాలని, ఇందిరమ్మ ఇండ్ల పథకాలనికి అర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నష్టాన్ని లెక్కించి.. అవసరమైతే దీనిని విపత్తుగా ప్రకటించి ప్రత్యేక నిధులతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు లెండుగురే శ్యాంరావు, రాజ్‌కుమార్, రాజు, అనూప్, నిత్యానంద్, గోకుల్, రింకు పాల్గొన్నారు.

మందమర్రిలో ఎస్ఐ రాజశేఖర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బండి నోరు అదుపులో పెట్టుకో..

- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి డా.రాజారమేశ్
- కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై పలు పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు

చెన్నూర్ టౌన్, మార్చి 24 : తెలంగాణ బాపు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డా.రాజారమేశ్ డిమాండ్ చేశారు. సంజయ్ నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. కేసీఆర్‌పై నిరాధారమైన ఆరోపణలు చేసినందుకు బండి సంజయ్‌పై కేసు నమోదుచేయాలని, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం చెన్నూర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పార్టీ నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. నియోజకవర్గ నాయకుడు డా.రాజారమేశ్ మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. బీదర్‌లో దొంగనోట్లు ముద్రించే ప్రింటింగ్ ప్రెస్ ఉందని, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆ నకిలీ నోట్లనే ఓటర్లకు పంచారని ఇష్టారీతిన మాట్లాడడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ పార్టీపై నోరుజారితే ఖబడ్దార్ అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నవాజొద్దీన్, మాజీ ప్రజాప్రతినిధులు మంత్రి బాపు, మోతె తిరుపతి, రేవెల్లి మహేశ్, జోడు శంకర్, శ్రీనివాస్, నాయకులు నాయిని సతీశ్, సురేశ్ రెడ్డి, భారతి, రవి, మల్లేశ్, కొప్పుల రవీందర్, నాయబ్, సురేశ్, ఆశిష్, జలీల్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మందమర్రి, మార్చి 24: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కేసీఆర్‌పై నిరాధారమైన ఆరోపణలు చేసినందుకు బండి సంజయ్‌పై కేసు నమోదు చేయాలని కోరుతూ సోమవారం మందమర్రి ఎస్ఐ రాజశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ తెలంగాణకు కేంద్రం నుంచి నిధులు తెచ్చే ఆలోచన లేదుగాని తెలంగాణ సాధించిన కేసీఆర్ పై ఇష్టానుసారంగా మాట్లాడడం సంజయ్ అవివేకానికి నిదర్శనమన్నారు. మరోసారి కేసీఆర్‌పై నోరుజారితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజక వర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ రాజారమేశ్, పట్టణ అధ్యక్షుడు జే.రవీందర్, బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు రాజశేఖర్, బండారు సూరిబాబు, బడికెల సంపత్ కుమార్, ఈశ్వర్, మద్ది శంకర్, సంగ వెంకటేశ్, పల్లె నర్సింగ్, భట్టు రాజ్‌కుమార్, ఎండీ ముస్తఫా, బర్ల సదానందం, ప్రతాప్ సారంగపాణి, మోహన్, దాసరి నవీన్, అందె శ్రీకాంత్, నాయకులు చిప్పకుర్తి రేఖ, రమా, శారద పాల్గొన్నారు.

చెన్నూర్ టౌన్ : బండి సంజయ్‌పై ఫిర్యాదుచేస్తున్న నాయకులు

కోటపల్లి, మార్చి 24 : కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని కోటపల్లి పోలీస్‌స్టేషన్‌లో చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్‌కు బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వాల శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ కేసీఆర్‌పై విమర్శలు చేసి హైలెట్ కావాలని బండి సంజయ్ తన హోదాను తగ్గించుకొని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ఏమిటో తెలంగాణ ప్రజలకు తెలుసునని, కేసీఆర్ ఓట్ల కోసం, సీట్ల కోసం తన హోదాను తగ్గించుకోడని అన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు సాంబాగౌడ్, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు మారిశెట్టి విద్యాసాగర్, డైరెక్టర్ మల్లయ్య, నాయకులు కొట్టె నారాయణ, తిరుపతి రావ్, అక్కల మధూకర్, చందు, రాళ్లబండి స్వామి, కామ శ్రీనివాస్, కుమార్, అజ్మెర పున్నం, మారుపాక పోచం, గోనె మోహన్ రెడ్డి, భూమయ్య, ఆసంపల్లి సంపత్‌కుమార్, గుగ్లోత్ బాపు నాయక్, ఇందూరి మహేశ్, కామెర పవన్, కొట్రంగి మల్లేశ్, అజయ్ పాల్గొన్నారు.

మంచిర్యాల అర్బన్, మార్చి 24 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై నోరుజారిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ పట్టణ నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. నాయకులు అంకం నరేశ్, శ్రీరాముల మల్లేశ్, అక్కూరి సుబ్బన్న, మెరుగు పవన్, బేర సత్యనారయణ, పంబాల ఎర్రయ్య, పెరమల్ల జానార్ధన్, కుమ్మం రాజేశ్వర్ రెడ్డి, కొండపర్తి శంకర్, కాటంరాజు, మహమ్మద్ సాజిద్, తదితరులు పాల్గొన్నారు.

డిపాజిట్లపై అధిక వడ్డీ ఇస్తున్నాం

- యూనివర్సల్ బ్యాంకు ప్రగతికి సహకరిస్తున్నందుకు కృతజ్ఞతలు
- బ్యాంక్ చైర్మన్ వినయ్ కుమార్

మంచిర్యాల అర్బన్, మార్చి 24 : యూనివర్సల్ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నదని చైర్మన్ వీ.వినయ్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని యూనివర్సల్ బ్యాంక్‌లో యూనివర్సల్ కో ఆపరేటీవ్ అర్బన్ బ్యాంక్ 47వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ 2024-25 అర్థ వార్షిక సంవత్సరంలో రూ.48.28 లక్షలు(ఆడిట్ కానిది) నికర లాభం వచ్చిందన్నారు. మంచిర్యాల, సీసీసీల్లో ఏటీఎం సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు ఇతర బ్యాంకుల కన్నా డిపాజిట్లపై ఎక్కువ వడ్డీ ఇస్తున్నామని, బ్యాంకుకు రాలేని వారికి ఇంటికెళ్లి సేవలు అందిస్తున్నామన్నారు. బ్యాంకు ప్రగతి కోసం సహాయ సహకారాలు అందిస్తున్న వాటాదారులు, ఖాతాదారులు, రిజర్వ్ బ్యాంక్, సహకార శాఖ, మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం బ్యాంక్ ఇన్‌చార్జి సీఈవో కేవీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ త్వరలో భూపాలపల్లి, గోదావరిఖనిలో బ్రాంచీలు నెలకొల్పుతున్నామని, చిన్న, మధ్య తరగతి ప్రజలకు రుణ సదుపాయం కల్పిస్తూ ఆర్థిక ప్రగతికి తోడ్పాటు అందిస్తున్నామన్నారు. బ్యాంకు వైస్ చైర్మన్ జీ.పూర్ణచంద్ర రావు, డైరెక్టర్లు కేఎస్ఎం రావు, జీ.కృష్ణ మూర్తి, శ్రీదేవి, బక్కయ్య, ప్రసాదరావు, రాజలింగు, భానుప్రకాశ్, రత్నం, సుశీల, భాగ్యలక్ష్మి, ఆదిత్య , శ్రీపతి శ్రీనివాస్, వాటాదారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ వీ.వినయ్ కుమార్

కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మార్చి 23 : గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ పలువురు సోమవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ భోజన వసతితో పాటు వీడియో గ్రాఫర్, వాహనాలకు సంబంధించిన బిల్లులు చెల్లించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎలక్షన్ కమిషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్తే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇకనైనా స్పందించకుంటే కుటుంబ సభ్యులతో కలిసి నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు. జగదాంబ హోటల్ నిర్వాహకుడు సుదర్శన్, ఫొటోగ్రాఫర్ రాజు, వాహన యజమాని సోనుతో పాటు వివిధ రకాల బకాయిలున్న యజమానులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

మొట్లగూడలోని చేతి పంపును పరిశీలిస్తున్న అధికారులు

మొట్లగూడకు తరలిన యంత్రాంగం

- తాగు నీటి సమస్య గురించి తెలుసుకున్న అధికారులు
- ఇంటింటికీ మిషన్ భగీరథ నీరందిస్తామని హామీ

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

దహెగాం, మార్చి24 : ప్రజలు తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ సోమవారం 'నమస్తే తెలంగాణ'లో 'మొట్లగూడ గోడు పట్టదా' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు ఎంపీడీవో రాజేందర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఇనోస్, మిషన్ భగీరథ ఏఈ సాయికృష్ణ స్పందించి గ్రామాన్ని సందర్శించారు. తాగనీటి సమస్య గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీరు ఇంటింటికీ అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. చేతి పంపులకు మరమ్మతులు చేస్తామని తెలిపారు.